ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుకు అభినందనల వెల్లువ

భద్రాచలం, డిసెంబర్ 13: భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఆయనకు బుధవారం మిషన్ భగీరథ డీఈ ఏసురాజు పుష్పగుచ్ఛమిచ్చి అభినందనలు తెలిపారు.

ఐటీడీఏ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావును దుమ్ముగూడెం మండలం గౌరారం సర్పంచ్ సోడె జ్యోతి కలిశారు. స్వీట్ బాక్స్ అందజేసి అభినందనలు తెలిపారు.

ఉత్తర ద్వార దర్శనం టికెట్ల విక్రయానికి ప్రత్యేక కౌంటర్లు

భద్రాచలం, డిసెంబర్ 13: భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం టికెట్ల విక్రయానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎల్.రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో, ఆలయ మెయిన్ కౌంటర్ వద్ద, సీఆరో కార్యాలయం వద్ద, బ్రిడ్జి సెంటర్‌లోని సీఆర్వో కార్యాలయం వద్ద ఈ ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. రూ.2.000ల వీఐపీ సెక్టార్ టికెట్లు 290, రూ.1000ల సెక్టార్-ఏ టికెట్లు 141, రూ.500ల సెక్టార్-బీ టికెట్లు 537, రూ.500 సెక్టార్-డీ టికెట్లు 33, రూ.250ల సెక్టార్-ఈ టికెట్లు 367 మాత్రమే ఉన్నాయని వెల్లడించారు.

పాఠశాలకు ఫ్యాన్లు అందజేత

ఫ్యాన్లు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

అశ్వాపురం, డిసెంబర్ 13: స్థానిక జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలకు 1992-93 పదోతరగతి విద్యార్థులైన కొర్లకుంట శ్రీనివాసరావు, తాడబోయిన వెంకటేశ్వర్లు, రవికుమార్, హెవీ వాటర్ ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగి లక్ష్మిప్రసాద్ బుధవారం నాలుగు సీలింగ్ ఫ్లాన్లను అందించారు. తాడబోయిన వెంకటేశ్వర్లు-యశోద దంపతులు రూ.1,000 ఇచ్చారు. వీరికి ప్రధానోపాధ్యాయురాలు యోగితావేణి, ఉపాధ్యాయులు శేషాచార్యులు, ప్రశాంతికుమారి, జ్యోతి, నాగభూషణం, శేఖర్, పద్మజకుమారి కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు హార్వెస్ట్ విద్యార్థుల ఎంపిక

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 13: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన అండర్-17 క్రికెట్ పోటీల్లో, అండర్-19 అథ్లెటిక్స్ పోటీల్లో నగరంలోని హార్వెస్ట్ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి బుధవారం తెలిపారు. పాఠశాల విద్యార్థులు శ్రీజన్, వైశాలి స్వర్ణ పతకాలు సాధించి మహారాష్ట్రలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కరస్పాండెంట్ రవిమారుత్ అభినందించారు.

ఎస్‌బీఐటీ విద్యార్థులు 21 మందికి ప్లేస్‌మెంట్

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 13: నగరంలోని ఎస్‌బీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో హైకీ కన్సల్టెన్సీకి 21 మంది విద్యార్థులు ఎంపికైనట్లు చైర్మన్ గుండాల కృష్ణ బుధవారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్ డాక్టర్ ధాత్రి, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, అకడమిక్ డైరెక్టర్లు, అధ్యాపకులు అభినందించారు.

రైతుల ఖాతాల్లో 'రైతుబంధు' జమ

దుమ్ముగూడెం, డిసెంబర్ 13: మండలంలోని రైతుల ఖాతాల్లో రైతుబంధు నగదును ప్రభుత్వం బుధవారం నుంచి జమ చేస్తున్నదని మండల వ్యవసాయాధికారి నవీన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలవ్యాప్తంగా మొత్తం 17,117 మంది రైతులకుగాను 3016 మందికి రూ. 96,81,945 జమ అయ్యాయని పేర్కొన్నారు.

వణికిస్తున్న చలి

కరకగూడెం, డిసెంబర్ 13: ఏజెన్సీ వాసులను చలి గడగడ వణికిస్తున్నది. వారం రోజుల నుంచి చలి రోజు రోజుకూ తీవ్రమవుతున్నది. సాయంత్రం 5.00 గంటలకే చలి మొదలవుతున్నది. ఉదయం 8.00 గంటల వరకూ పొగమంచు వీడడం లేదు. చలిని దూరం చేసేందుకు మంట వేస్తున్నారు. ముందున్న రోడ్డు, ఎదురుగా వస్తున్న వాహనాలు సరిగ్గా కనిపించకపోవడంతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు.

కోర్టుకు కుర్చీలు అందజేత

మణుగూరు టౌన్, డిసెంబర్ 13: మణుగూరు ఫస్ట్‌క్లాస్ జ్యూడీషియల్ కోర్టుకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేదరమెట్ల శ్రీనివాస్ తన తండ్రి జ్ఞాపకార్థం బుధవారం 20 కుర్చీలను మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు ద్వారా అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు శైలజ, పద్మావతి, కవిత, రామ్మోహన్, జాడి చొక్కారావు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్‌ను గెలిపించండి

మణుగూరు టౌన్, డిసెంబర్ 13: కార్మికులను కంటికి రెప్పలా కాపాడుతున్న టీబీజీకేఎస్‌ను గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలిపించాలని మణుగూరు ఏరియా ఉపాధ్యక్షుడు వూకంటి ప్రభాకర్‌రావు కోరారు. ఆయన బుధవారం ఓసీ-4 గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. కార్మికులకు అనేక హక్కులతోపాటు వారసత్వ ఉద్యోగాలను టీబీజీకేఎస్ సాధించిందని అన్నారు. వందలమంది అండర్ గ్రౌండ్ ఫిట్టర్లు, ఎలక్ట్రీషియన్లకు సర్ఫేస్ ఉద్యోగోన్నతులు ఇప్పించిందని అన్నారు. టీబీజీకేఎస్ కృషితోనే అంబులెన్స్ అందుబాటులోకి వచ్చినట్లు చెప్పారు. కరెంటు చార్జీల రద్దు, మ్యాచింగ్ గ్రాంట్ పది రెట్లు పెంపు, 32 శాతం లాభాల వాటా, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వయోపరిమితి పెంపు తదితరాలన్నీ టీబీజీకేఎస్ కృషితోనే వచ్చాయని అన్నారు.

టీబీజీకేఎస్‌లో చేరిన వారిని ఆహ్వానిస్తున్న ప్రభాకర్‌రావు

వీటిని కాపాడేందుకు కార్మికుల పక్షాన పోరాడే టీబీజీకేఎస్‌ను గెలిపించాలని కోరారు. ఏఐటీయూసీ నుంచి టీబీజీకేఎస్‌లో చేరిన ఈపీ ఆపరేటర్లు జోగారావు, రమేష్‌కు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కేంద్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ అబ్దుల్ రవూఫ్, నాయకులు వీరభద్రయ్య, ఎస్‌వీఎస్ఎన్ వర్మ, బానోత్ కృష్ణ, ఈసం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన, సన్మానం

విఘ్నేశ్వర్‌ను సన్మానిస్తున్న జీఎం దుర్గం రామచందర్

అనిల్‌కుమార్‌ను అభినందిస్తున్న జీఎం రామచందర్

మణుగూరు టౌన్, డిసెంబర్ 13: ఈ నెల 27న అండమాన్ నికోబార్ దీవుల్లో జరిగే జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన మణుగూరు మండలానికి చెందిన భద్రాద్రి ఫుట్‌బాల్ క్లబ్ క్రీడాకారుడు పి.సిద్ధి విఘ్నేశ్వర్‌ను సింగరేణి ఏరియా జీఎం దుర్గం రామచందర్ బుధవారం అభినందించారు. అతడిని సన్మానించి, స్పోర్ట్స్ యూనిఫాం అందజేశారు. అధికారులు వీసం కృష్ణయ్య, డి.వెంకటేశ్వర్లు, రమేష్, జాన్‌వెస్లీ, ఆర్.శ్రీనివాస్, విఘ్నేశ్వర్ తండ్రి నాగరాజు పాల్గొన్నారు.

'బంగారం ఎత్తిన' అనిల్‌కుమార్‌కు...

మణుగూరు టౌన్, డిసెంబర్ 13: వెయిట్ లిఫ్టింగ్ 67.5 కేజీల విభాగంలో కోలిండియా స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన మణుగూరు ఏరియా కేసీహెచ్‌పీ జనరల్ మజ్దూర్ కోరం అనిల్‌కుమార్‌ను జీఎం దుర్గం రామచందర్ బుధవారం తన కార్యాలయంలో సన్మానించారు. మున్ముందు కూడా ఇలాగే రాణించాలని ఆకాంక్షించారు.

తుపాన్ బాధిత రైతులు అధైర్యపడవద్దు

మణుగూరు టౌన్, డిసెంబర్ 13: తుపాన్ బాధిత రైతులెవ్వరూ అధైర్యపడవద్దని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కోరారు. ఆయన బుధవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో విలేకరులతో మాట్లాడారు. పంట నష్టాన్ని వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి నివేదిక ఇస్తారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నష్ట పరిహారం ఇస్తుందని చెప్పారు. కాంగ్రెస్ గెలుపునకు కృషి చేసిన కాంగ్రెస్-మిత్రపక్షాల శ్రేణులకు, కార్మికులకు, ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ నా యకులు చందాసంతోష్, పీరినాకి నవీన్, కేవీ రావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న నాయకులు

ఎమ్మెల్యేకు సన్మానం

మణుగూరు టౌన్, డిసెంబర్ 13: పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును సీపీఐ నాయకులు, కార్యకర్తలు, బొగ్గు మురా కార్మికులు, ప్రజాసంఘాల బాధ్యులు బుధవారం సన్మానించారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్కే షాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్యాచారి మాట్లాడుతూ.. ప్రజాసమస్యల పరిష్కారానికి, పేద ప్రజల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు చందా సంతోష్‌కుమార్, కేవీ రావు, పుచ్చకాయల శంకర్, శివ, సీపీఐ నాయకులు సరెడ్డి పుల్లారెడ్డి, పాకాలపాటి చందు, కమటం వెంకటేశ్వరరావు, దుర్గ్యాల సుధాకర్, జంగం మోహన్‌రావు, ఆర్.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను నెరవేర్చాలి

పినపాక, డిసెంబర్ 13: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని సీపీఎం మండల కన్వీనర్ నిమ్మల వెంకన్న డిమాండ్ చేశారు. ఆయన బుధవారం ఈబయ్యారం అడ్డరోడ్‌లో పార్టీ మండల స్థాయి సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధి విషయంలో ప్రతిపక్షాల సూచనలు, అభిప్రాయాలను ప్రభుత్వం తీసుకోవాలన్నారు. అహంకారంతో, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రజలపక్షాన సీపీఎం పోరాడుతుందని అన్నారు. నాయకులు, దుబ్బ గోవర్ధన్, మడవి నాగేష్, నట్టి శంకరయ్య పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటికి శుభాకాంక్షలు

మంత్రి పొంగులేటితో శ్రీవాణి దంపతులు

కరకగూడెం, డిసెంబర్ 13: రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సమత్‌భట్టుపల్లి సర్పంచ్ పోలెబోయిన శ్రీవాణి-తిరుపతయ్య దంపతులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువా కప్పి సత్కరించారు. కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమానికి బీఆర్ఎస్ కృషి

మాట్లాడుతున్న రేగా కాంతారావు

మణుగూరు టౌన్, డిసెంబర్ 13: ప్రజల సంక్షేమానికి బీఆర్ఎస్ కృషి చేస్తుందని, వారి పక్షాన పోరాడుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే, రేగా కాంతారావు అన్నారు. ఆయన బుధవారం పార్టీ స్థానిక కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఎన్నికల హామీలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నెరవేర్చకుంటే బీఆర్ఎస్ పోరాడుతుందని అన్నారు.

చిన్న అరుణాచలంలో అన్న ప్రసాదం

దుమ్ముగూడెం, డిసెంబర్ 13: కార్తీక మాసం చివరి రోజు బుధవారం మండలంలోని నరసాపురం ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం(చిన్న అరుణాచలం) లో భక్తులకు ఆలయ కమిటీ వ్యవస్థాపకుడు శివనాగస్వామి అన్న ప్రసాదం అందించారు. స్వామి వారిని భక్తులు పూజించి ప్రసాదం స్వీకరించారు.

పర్యావరణాన్ని కాపాడాలి

సారపాక, డిసెంబర్ 13: పర్యావరణాన్ని కాపాడేందుకు ఐటీసీ పీఎస్‌పీడీ యాజమాన్యం చర్యలు చేపట్టాలని న్యూడెమోక్రసీ నాయకుడు పున్నం చంద్ డిమాండ్ చేశారు. ఐటీసీ కర్మాగారం కారణంగా కొన్ని గ్రామాల్లో గత 45 ఏళ్లుగా పొలాలు, పశువులు కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయని, ప్రజలు అనారోగ్యంతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన బుధవారం సారపాకలో పార్టీ సమావేశంలో మాట్లాడారు.